క్లుప్తంగా

ముచ్చట్ల మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం మాఘమాసం సందర్భంగా శివమాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉదయం ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

బనగానపల్లె రూరల్: స్థానిక రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి తెలిపారు. విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21-22 తేదీలలో గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారు సత్తెనపల్లిలోని వారింద మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్ షిప్ (బాలురు, బాలికల) విభాగం పోటీల్లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు అంకిత, గంగధర్, 8వ తరగతి అభ్యసిస్తున్న సుహితారెడ్డి ప్రతిభ కనబరిచారన్నారు.

నాపరాతి గనుల్లో మోటార్లు చోరీ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లె సమీపంలోని నాపరాతి గనుల్లో సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు మోటర్లు చోరీ చేశారు. గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య, చంద్ర, ఓబుళరెడ్డి, గంగరాజుతో పాటు మొత్తం ఏడు మంది ఊరి శివార్లలో ఉన్న నాపరాతి గనులు చేస్తున్నారు. నాపరాళ్ల కోత మిషన్‌కు సంబంధించిన ఏడు నీళ్ల మోటర్లతో పాటు విద్యుత్ తీగను తీసుకెళ్లారు. రోజు మాదిరిగా గనిలోకి పనికి వెళ్లి చూసే సరికి మోటార్లు, విద్యుత్ తీగ కనిపించ లేదు. ఈవిషయంపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

ఆనందీబాయి సేవలు చిరస్మరణీయం

బేతంచెర్ల: దేశంలో వైద్య పట్టా పొందిన మొదటి వైద్యురాలు ఆనందీబాయి సేవలు చిరస్మరణీయమని డోన్ సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం స్థానిక శేషారెడ్డి సీహెచ్‌సీలో వైద్యురాలు సాగరిక ఆధ్వర్యంలో ఆనందీబాయి వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైద్యులు వంశీకృష్ణ, చరణ్‌రాజు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పారిశుధ్య కార్మికులకు సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మేజర్ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి దుస్తులు అందజేశారు.ఈ సందర్భంగా వారు రోటరీక్లబ్ సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కోవెలకుంట్ల: పట్టణంలోని బాబానగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 108 అంబులెన్స్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన మహమ్మద్ రఫీ కుటుంబ సమస్యల కారణంగా ఇంటి దంతెలకు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఉరి నుంచి తప్పించి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్: అనంతపురం జిల్లా కదిరి పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో డోన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందుకున్నారు. పట్టణానికి చెందిన రామ్స్ స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు కటా విభాగంలో లౌక్య, సాయిచరణ్, బాలాజీ, అభిరామ్, తరుణ్, మోక్షిత్ ఆనంద్ రెడ్డి, అనీస్‌లు బంగారు పతకాలు, కమిటీ విభాగంలో బాలాజీ, రాజేష్‌సింగ్, తరుణ్, మోక్షిత్ ఆనంద్‌రెడ్డి కాంస్య పతకాలు సాధించారు. వీరిని స్పోర్ట్స్ కరాటే టు అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రావు చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించినట్లు టీమ్ మేనేజర్ బాబా తెలిపారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ రంగంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్, ఆపైన చదివి 18 నుంచి 26 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారికి బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లింగాల.. అభివృద్ధి గలగల..!

- రూ. 3.33 కోట్లతో అభివృద్ధి పనులు
- సీసీరోడ్లు కళకళ
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- తీరిన శాశ్వత కష్టాలు
- ప్రజల్లో హర్షాతిరేకాలు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఒకవైపు నవరత్న పథకాలతో పేద కుటుంబాల్లో వెలుగులు నింపగా మరోవైపు ప్రజల కష్టాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడంతో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. కోవెలకుంట్ల మండలం రేవనూరు గ్రామ సచివాలయ పరిధిలోని లింగాల గ్రామంలో రూ.3.33 కోట్లతో చేపట్టిన పనులు అభివృద్ధికి అద్దం పడుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, నాడు- నేడు కార్యక్రమంతో పాఠశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దటమే కాకుండా పురాతన ఆలయాలను జీర్ణోద్ధరణ గావించడంతో గ్రామంలో అభివృద్ధి, ఆధ్మాతిక్మకం ఉట్టిపడుతోంది. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ఆదర్శ గ్రామంగా నిలుస్తోంది.

– కోవెలకుంట్ల





రూ.1.14 కోట్లతో నిర్మించిన ఆలయాలు







రూ.1.19 కోట్లతో గుండుపాపల- లింగాల రహదారిలో ఏర్పాటు చేసిన సీసీరోడ్డు,రూ.10 లక్షలతో బీసీ కాలనీలో నిర్మించిన సీసీరోడ్డు,ఉచిత మినరల్‌వాటర్ ప్లాంట్



గ్రామంలో రూ.3.33 కోట్లతో చేపట్టిన అభివృద్ధి ప నులతో గ్రామంలోని ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఇతర కా లనీల్లో ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టా లు శాశ్వతంగా తొలగిపోయాయి. ఎస్సీ, బీసీ కాలనీల్లో అంతర్గత రోడ్లు లేక వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడేవారు. చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ చేరి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు బు రద మయంగా మారిన దారుల్లో నడిచేందుకు నానా తంటాలు పడేవారు. సీసీరోడ్లు ఏర్పాటు చేయాలని గతంలో ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే లేడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి అన్ని వసతులు కల్పించడంతో ప్రజలకు అంతర్గత రహదారుల కష్టాలు తీరిపోయాయి. జలజీవన్ మిషన్ ద్వారా పైప్‌లైన్, కొళా యిల ఏర్పాటు, మినరల్‌వాటర్‌ప్లాంట్ కు పైప్‌లైన్, బోరు వసతి కల్పించడంతో గ్రామస్తులకు శాశ్విత తా గునీటి కష్టాలు తీరిపోయాయి. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టడంతో సర్కారు బడి కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా కన్పిస్తోంది.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- రూ.1.19 కోట్లతో గుండుపాపల-లింగాల ఆర్ అండ్‌బీ రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం
- రూ. 1.14 కోట్లతో సోమేశ్వర, లక్ష్మిచెన్నకేశవ, శ్రీరామ, గణపతి, లింగమయ్య, నాగసుబ్రమణ్య ఆలయాల పునర్నిర్మాణం
- రూ.10 లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు ఏర్పాటు
- రూ.20లక్షలతో ఎస్సీకాలనీలో డ్రెయినేజి ఏర్పాటు
- రూ.10 లక్షలతో లింగాల- ఉప్పలూరు పొలాల రస్తాలో గ్రావెల్‌రోడ్డు
- జలజీవన్ మిషన్ ద్వారా రూ. 14 లక్షలతో పైప్‌లైన్, కుళాయిల ఏర్పాటు
- రూ.18 లక్షలతో నాడు- నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలో వంటగది, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల మరమ్మతులు
- బీసీ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- రూ.4 లక్షలతో లింగాల- టంగుటూరు గ్రావెల్ రోడ్డు
- రూ.3 లక్షలతో మినరల్‌వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పైప్‌లైన్, బోరు ఏర్పాటు

అన్ని వసతులు కల్పించాం



గ్రామంలోని ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో అన్ని వసతులు కల్పించాము. సీసీరోడ్లు, డ్రెయినేజి, తాగునీరు, విద్య, తదితర అంశాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రూ 3 కోట్లకు పైగా నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేశాం. రాబోయే రోజుల్లో మిగిలిపోయిన పనులు పూర్తి చేసి గ్రామాన్ని మరింత అభివృద్ధి బాటలో నిలుపుతాం.

– డీవీ శేషిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, లింగాల

కష్టాలు తీరిపోయాయి



గ్రామంలో ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు తీరిపోయాయి. ఆయా కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజి వసతి కల్పించడంతో ప్రజలకు అంతర్గత రహదారి కష్టాలు తొలగాయి. గతంలో అంతర్గత రోడ్లు లేక పడుతున్న అవస్థలకు చెక్ పడింది.

– వెంగళరెడ్డి, గ్రామస్తుడు, లింగాల

విద్యారంగానికి పెద్దపీట



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నాడు- నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులు అభివృద్ధి చేసింది. గ్రామంలో ఉన్న పాఠశాలకు రూ.18 లక్షలతో అన్ని వసతులు కల్పించింది. తరగతి గదుల మరమ్మతులు, వంటగది, మరుగుదొడ్ల ఏర్పాటు చేసి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించారు.

– రాంపుల్లారెడ్డి, గ్రామస్తుడు, లింగాల

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

– జడ్జి తంగమణి



మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: మార్చి 9న జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. స్థానిక ప్రినన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హాల్‌లో సోమవారం లోక్ అదాలత్‌పై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, బ్యాంక్ మేనేజర్లు సచీంద్రబాబు, బోరెడ్డితో పాటు బీఎస్ఎన్ఎల్ తదితర సంస్థల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసులుపై ప్రత్యేక దృష్టి సారించాలని, లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు తెలియజేసి వారిని హాజరయ్యేలా చైతన్య కలిగించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సమయం ఆదా అవ్వడంతో పాటు సత్వర న్యాయం లభిస్తుందన్నా విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

డోన్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ప్రారంభించిన మోదీ

డోన్ రూరల్: అమృత్ భారత్ పథకంలో భాగంగా డోన్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులతో పాటు దేశంలోని మరో 553 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ పనులను సోమవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డోన్ రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సివిల్ కోర్టు జడ్జి తంగమణి హాజరై, మున్సిపల్ కమిషనర్ జయరాం, బీజేపీ నాయకులు సందు రమణ, కిరణ్, కట్టె మల్లికార్జున, రమణ, సుధాకర్, రైల్వే సిబ్బంది రంగస్వామి తదితరులు వీక్షించారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

డోన్ టౌన్: రైతుల మాటున వధశాలకు గోవులను తరలిస్తున్న వ్యాపారులపై ఇందుకు సహకరిస్తున్న వ్యవసాయ మార్కెట్‌యార్డు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బుడ్డా శ్రీకాంత్ రెడ్డిలు కోరారు. సోమవారం ఆర్డీఓ మహేశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీలో ప్రతి గురువారం జరిగే పశువుల సంతలో తెలంగాణ, తమిళనాడుకు చెందిన కొందరు వ్యాపారులు రైతుల ముసుగులో గోవులను కొనుగోలు చేసి గోవధ శాలలకు తరలిస్తున్నారని ఆరోపించారు. వీరికి వ్యవసాయ మార్కెట్ సిబ్బంది సహకరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా నిఘా ఉంచి అలాంటి వ్యాపారులు, వ్యవసాయ మార్కెట్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డే మహారాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాఘవేంద్రాచారి, నాయకులు మద్దిలేటి, ఆర్‌కే రెడ్డి, వెంకటేశ్వర్లు, వేణుయాదవ్ ఉన్నారు.



ఆర్డీఓ మహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సింహగర్జనను విజయవంతం చేయండి

ప్యాపిలి: దివ్యాంగుల సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం ఈ నెల 29న కర్నూలు ఎస్టీబీసీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న దివ్యాంగుల సింహగర్జన మహా సభను విజయవంతం చేయాలని దివ్యాంగుల జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి శివశంకర్, విశ్వక్రాంతి సమాఖ్య గౌరవ అధ్యక్షులు మల్లికార్జునలు కోరారు. సింహగర్జన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులు, చట్టాలు, రాయితీలు, రిజర్వేషన్ల అమలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, రామకృష్ణ, తిరుపతయ్య, రంగస్వామి, రామచంద్రుడు, నాగరాజు, ఫాతీమా, షరీఫ్, హుస్సేన్‌బీ, సంజీవులు, రామాంజనమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



మహిళలతో మాట్లాడుతున్న కాటసాని ఓబుళరెడ్డి

కోవెలకుంట్ల: కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుళరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం ఆయన కలుగొట్ల గ్రామంలో పర్యటించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని కోరారు. ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు మాచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాచంరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, రాజేంద్రనాథ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, జోళదరాశి సర్పంచ్ ఈర్నపాటి నాగేంద్ర పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయండి



పట్టణంలో పర్యటిస్తున్న అర్జున్‌రెడ్డి

డోన్: పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన పట్టణంలోని పలువురు ప్రముఖుల ఇళ్లకు వెళ్లి తన తండ్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ మదన్‌యాదవ్, ఎంపీటీసీ సుధాకర్ యాదవ్, సర్పంచ్ రమణ యాదవ్, జిల్లా సింగిల్‌విండో డైరెక్టర్ సీమ సుధాకర్‌రెడ్డి, వైఎసస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులను కలిసి తన తండ్రి గెలుపునకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. ఆయన వెంట పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దొరపల్లె చిరంజీవి, కురుకుంద హరి, నాయకులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత

బనగానపల్లె: ఆలయాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని కొండపేటలో సోమవారం లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం పునర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ ఆలయ పునర్‌నిర్మాణం కోసం టీటీడీ మొదటి విడతగా రూ.1.85 కోట్లు మంజూరు చేసిందన్నారు. మిగిలిన మొత్తం విడతలవారీగా మంజూరవుతుందన్నారు.ఆలయ అభివృద్ధికి తాము ముందుంటామని, ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, ఆలయ పునర్ నిర్మాణ కమిటీ అధ్యక్షులు గాథంశెట్టి రవి కుమార్, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, ఆలయ ఈఓ బ్రహ్మానందరెడ్డి, ఎంపీడీఓ శివరామయ్య, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ట

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామంలో చౌడేశ్వరీదేవి అమ్మవారి సింహ శిఖర విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, అవుకు పీఏసీఎస్ చైర్‌పర్సన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, అవుకు ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

బనగానపల్లె రూరల్: యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మార్చి 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సోమవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఆయన స్వగృహంలో ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు మహేష్ తదితరులు అందజేశారు



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రామిరెడ్డి దంపతులు, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి



అవుకులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

అభివృద్ధిని చూసి ఓర్వలేని బీసీ

అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఓర్వలేక పోతున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి అన్నారు. కోట్లాది రూపాయలతో రహదారులను నిర్మిస్తున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ నాయకులు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. బాగోలేని ప్రదేశానికి వెళ్లి సెల్ఫీలు దిగటం కాదని, ధైర్యం ఉంటే అభివృద్ధి జరిగిన ప్రదేశానికి వెళ్లి సెల్ఫీలు దిగాలని హితవు పలికారు.

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

బనగానపల్లె రూరల్: పేదల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సోమవారం పసుపల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రూ.3.04 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వారు ప్రారంభించారు. పసుపల గ్రామానికి చెందిన 100 మంది లబ్ధిదారులకు 141.47 ఎకరాలు అసైన్‌మెంట్ భూమిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మానసవీణ, సర్పంచ్ మోహన్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్ జనార్దన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఎంపీటీసీ మహేశ్వమ్మ, ఉపసర్పంచ్ హేమలత, యాగంటి ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, తండా సర్పంచ్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

అవుకు: రహదారులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శివవరం గ్రామ సమీపంలోని గొల్లలేరు డ్రైన్‌పై కల్వర్టు నిర్మాణానికి రూ.7.91 కోట్లతో చేపట్టిన పనులను సోమవారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పోచా శీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



రహదారి పనులను పరిశీలిస్తున్న కమిషనర్, తదితరులు

డోన్: పదిహేనో సచివాలయం పరిధిలో సోమవారం మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పారిశుధ్య పనుల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట డీఈ రసూల్, కౌన్సిలర్లు వెంకట్రాముడు, సుంకన్నతో పాటు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

బుగ్గనకు హ్యాట్రిక్ అందిస్తాం

ప్యాపిలి: డోన్ నియోజకవర్గాన్ని రూ.2,700 కోట్లతో అభివృద్ధి చేసిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తామని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు కమతం భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం వారు పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ డోన్ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ప్రకటించిందనన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న నాయకులు టీడీపీలోకి వస్తారని ఆ పార్టీ నేతలు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తామంతా సమష్టిగా బుగ్గన విజయానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో సింగిల్‌విండో అధ్యక్షులు ఆలేబాదు బాలయ్య, బోరెడ్డి రాము, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా మురళీకృష్ణ, జంగం చంద్రశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సన్మానించిన ప్రజాప్రతినిధులు

డోన్: పేదలకు విస్తృత సేవలందించిన 15వ సచివాలయ వలంటీర్లను సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సేవా వజ్ర పురస్కార గ్రహీత సునీత, సేవారత్న పురస్కార గ్రహీత సుమలత, టెస్టు మోనియల్ షేక్ మైమున్నిసా, సునీత, మరికొందరికీ సేవా మిత్ర అవార్డులు దక్కాయి. కార్యక్రమానికి కౌన్సిలర్లు వెంకట్రాముడు, సుంకన్న, కోఆప్షన్ మెంబర్ కుమ్మరి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దుపెంట వెంకటేష్, సుధాకర్, గోపాల్, మల్లికార్జున, సుంకన్న, మాబు తదితరులు హాజరయ్యారు.